ప్రేమస్వరూపులారా! ఈనాడు లోకములో తెలివితేటలే ముఖ్యమని భావిస్తున్నారు, కొందరు. విద్యలు లేక తెలివితేటలుండి ప్రయోజనమేమిటి? అట్లే, ఎన్ని విద్యలుండినను తెలివితేటలు లేకుండిన ప్రయోజనం లేదు. తెలివితేటలతోపాటు విద్యలుకూడా ఉండాలి. విద్యలుండియు తెలివితేటలు లేకుండిన అటువంటివానిని లోకులు ఒక మూర్ఖునిగా భావిస్తారు.

వ్రేపల్లెయందున్నటువంటి స్త్రీలు ప్రతి రోజు సాయంకాలము యశోద, నందుల ఇంటికి వెళ్లి దీపము ముట్టించుకునేటటువంటివారు. అది ఆనాటి సాంప్రదాయం. గొప్పవారి ఇంటినుండి దీపమును తమ ఇంటికి తీసికొనిపోతే తాముకూడా గొప్పవారమవుతామని వారి ఆశ. ఇప్పటికికూడను పల్లెలయందు ఇలాంటి వాడుక ఉన్నది. శ్రీమంతుల ఇంటికి వెళ్లి వాళ్ల ఇంటి ముందు పెట్టిన దీపముతో తమ దీపమును వెలిగించుకొని ఇంటికి తీసికొని వెళతారు. అయితే, వ్రేపల్లెలో కొందరు అత్తలు తమ కోడళ్లను యశోద ఇంటికి వెళ్లనిచ్చేవారు కాదు. అక్కడ కృష్ణుణ్ణి చూసి వీరు పిచ్చివారివలె అతనివెంట తిరుగుతారేమోనని వారికి భయం. "మన ఇంటిలో దీపము లేదా? వారింటినుండి దీపము ఎందుకు తెచ్చుకోవాలి?" అని కోడళ్లను మందలించేవారు. నీళ్లు తెచ్చుకోవడానికి బావిదగ్గర చేరినప్పుడుకూడను ఆడవాళ్లంతా కృష్ణునిగురించే ముచ్చటించేవారు. అప్పుడు ఆ గ్రామమునకు ఒక క్రొత్త కోడలు వచ్చింది. ఆమె పేరు సుగుణ. ఆమె కృష్ణుని యొక్క లీలలగురించి ఎంతగానో వినియున్నది. అత్తగారికి, భర్తగారికి చెప్పలేదుగాని, ఎలాగైనా కృష్ణుణ్ణి దర్శించుకోవాలనే కోరిక ఆమె మనస్సులో ప్రగాఢంగా నాటుకొనిపోయింది. తన కోరికను ఎంతో గోప్యముగా, ఎంతో గుట్టుగా పెట్టుకొన్నది. కాని, సత్యమును దాచిపెట్టుటకుగాని, అణచిపెట్టుటకుగాని, మూసిపెట్టుటకుగాని సాధ్యం కాదు. ఈ లోకమంతయు సత్యమునుండియే ఆవిర్భవించినది.

సత్యంబునందుండి సర్వంబు సృష్టించె<br>
సత్యంబునదణగె సర్వసృష్టి<br>
సత్యమహిమ లేని స్థలమేది కనుగొన్న?<br>
శుద్ధసత్వమిదియె చూడరయ్య

ఆ క్రొత్త కోడలు కృష్ణునిపట్ల తనకు గల భక్తిని ఎంత గుట్టుగా పెట్టుకొన్నదో అది అంత రట్టయిపోయింది. ఆమె యశోద ఇంటికి వెళ్లి 'కృష్ణా! కృష్ణా!' అని తలుచుకుంటూ దీపం అంటించుకుంటున్నది. ఆ దీపంలో ఆమెకు కృష్ణుడు కనిపించాడు.. ఆ తన్మయత్వంలో ఆమె దీపంలో చేయి పెట్టింది, చేయి కాలింది. కాని, ఆమెకు చేయి కాలుతున్నదన్న ధ్యాసే లేదు. ఇంతలో యశోద బయటికి వచ్చి సుగుణ చేయి పట్టుకుంది. "ఏమమ్మా! నిద్రపోతున్నావా? చెయ్యి అంతా మాడిపోతున్నది. నీకు బాధ తెలియడం లేదా?" అని అడిగింది. "తల్లీ! జ్యోతిలో కృష్ణుడు దర్శనమిచ్చాడు. కృష్ణుని చూస్తూ నా దేహాన్ని నేను మరచిపోయాను", అని సుగుణ ఆమెకు చెప్పింది. ఆ మాట విన్నారు, గోపికలు. ఎంతో ఆనందంగా వీధుల్లో డ్యాన్సు చేసుకుంటూ, పాట పాడుతూ వెళ్లారు. ఏమని?

**"సుగుణకు కనిపించెనంట<br>
నందుని ఇంట గోపాలుడంట<br>
దీపాన కనిపించెనంట"**

ఈవిధంగా దైవచింతనచేత మన దుఃఖములను, కష్టములనన్నిటినీ మరచిపోయి ఎంతో ఆనందాన్ని అనుభవించ వచ్చును. అనాదికాలమునుండి భక్తులు దైవచింతనద్వారా ఆనందాన్ని అనుభవిస్తూ, ప్రచార ప్రబోధలు సల్పుతూ వచ్చారు.

ఈనాడు తెలివితేటలు పెరుగుతూ వచ్చినాయిగాని, విద్యయొక్క ప్రమాణములు తరుగుతూ వచ్చినాయి. మీరు ఎక్కడైనా విద్యార్థులను చూడండి, ఏవో ఫారిన్‌నుండి వచ్చిన పేపర్లనో, మేగజైన్లనో చూస్తుంటారుగాని, తమ పాఠ్యపుస్తకాలపైన అంతగా శ్రద్ధ చూపరు. తమ సంప్రదాయములను, పద్ధతులనుగూర్చి ఏమాత్రము యోచించరు. ఈ ఆధునిక యుగములో ఈవిధమైన తెలివితేటలు పెరిగిపోయినాయి. 'ఫలానా రచయిత ఫలానా పుస్తకం రాశాడు, ఎంత గొప్పగా ఉందో!' అంటారు. ఇలాంటి విషయాలపైన చర్చలు, వాదోపవాదాలు చేస్తారు గాని, తమ టెక్స్ట్ బుక్స్‌లో ఏమున్నదో, తాము నేర్చుకోవలసిన విషయాలేమిటో, తాము చదువవలసిన పద్ధతు లేమిటో మరచిపోతున్నారు. ఈవిధంగా తెలివితేటలను పెంచుకుంటూపోతున్నారేగాని, విద్యయొక్క విశిష్టతను ఏమాత్రము జ్ఞప్తియందు ఉంచుకోవడం లేదు.

మనం కర్మాచరణను ఏమాత్రము విడిచిపెట్టకూడదు. "కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన..." అని భగవద్గీత కూడా బోధిస్తున్నది.

కర్మమున పుట్టు జంతువు<br>
కర్మముననె వృద్ధి పొంది కర్మమున చనున్<br>
కర్మయె నరునకు దైవము<br>
కర్మయె సుఖదుఃఖములకు కారణమిలలో!

మనం అనుభవించే సుఖదుఃఖములన్నింటికీ మన కర్మలే మూలకారణం. మంచి కార్యములు చేసినప్పుడు మంచి ఫలితములే మనము అనుభవిస్తాము. చెడ్డ కార్యములు చేసినప్పుడు, చెడ్డ తలంపులు తలచినప్పుడు చెడ్డ ఫలితములే అనుభవిస్తాము. మంచిని చేసి చెడ్డను అనుభవించలేము. అట్లే, చెడ్డను చేసినవారు మంచిని అనుభవించలేరు. చెడ్డను చేసినవాడు చెడ్డనే అనుభవిస్తాడు. మంచిని చేసినవాడు మంచినే అనుభవిస్తాడు. కనుకనే, 'డు గుడ్, బి గుడ్, సీ గుడ్. దిస్ ఈజ్ ది వే టు గాడ్'. మంచి భావాలను ఉద్భవింపజేసుకొని, మంచి కర్మలను ఆచరిస్తే మంచి ఫలితాలనే అనుభవిస్తాము. మన కర్మలయొక్క ఫలితములే మన సుఖదుఃఖములకు మూలకారణమని మీరు చక్కగా గుర్తించండి. మన పెద్దలందరుకూడను ప్రాచీన సంప్రదాయములను ఆచరిస్తూ, తద్వారా ఎంతో సుఖసంతోషాలను అనుభవిస్తూ వచ్చారు. కాని, ఈనాటి పిల్లలు పెద్దలు అనుసరించిన మార్గాన్ని, వాళ్లు ఆచరించిన పవిత్ర కర్మలను విస్మరించి, ఆధునిక విద్యలను అభ్యసించి అనేకవిధములైన అశాంతికి గురి అవుతున్నారు. అశాంతికి మాత్రమే కాదు, అసంతృప్తికికూడను లోనవుతున్నారు. అనారోగ్యమునకు కూడను గురి అవుతున్నారు.

మానవుని అనారోగ్యమునకు మూలకారణం అతని సంకల్పములే! అశాంతికి మూలకారణం తన గుణములే! కనుక, మన ప్రతి విషయంలోనూ మన సంకల్పములు మంచివిగా ఉండాలి. ఈనాడు ఎక్కడైనా చూడండి, పరిశుద్ధమైన నీరు త్రాగి, మంచి భోజనము భుజించి, మంచి గాలి పీల్చుకున్నప్పుడు మానవుని ఆరోగ్యము చక్కగా ఉంటుంది. మాలిన్యమైన జలమును గ్రోలి, అపవిత్రమైన భోజనము భుజించి, కలుషితమైన గాలిని పీల్చుకుంటూ సంచరిస్తున్నప్పుడు ఆరోగ్యము క్షీణించిపోతుంది. ఈనాటి మానవుని అనారోగ్యమునకు మూలకారణం కలుషితమైన నీరు, అపవిత్రమైన భోజనమే! మనం తీసుకునేవన్నీ పవిత్రమైనవిగా, మంచివిగా ఉండాలి. దసరా ఉత్సవాలు మనలో మంచి గుణములను పెంపొందించేందుకై ఉద్దేశించినవి. చక్కగా స్నానమాచరించి, మన ఇంట్లో పూజ చేసికొని, పవిత్రమైన భోజనము చేసి, పరిశుద్ధమైన జలమును గ్రోలినప్పుడు మనము ఎంతో ఆనందంగా ఉంటాము. మన ముఖము ఎంతగానో కళకళలాడుతుంటుంది. ఇంట్లో అపవిత్రమైన ఆహారమును

భుజిస్తూ, కలుషితమైన జలమును గ్రోలుతూ, కలుషితమైన వాతావరణములో సంచరిస్తూంటే, మన మానవత్వమునే మరచిపోతాము. దైవలక్షణాలను కోల్పోయి, దయ్యం లక్షణాలను పొందుతాము.

చాలామంది నన్ను చూసి, "స్వామీ! మీ దేహానికి 81 ఏళ్ళు వస్తున్నాయే! అయినా మీరు ఆవిధంగా కనిపించడం లేదే!" అని ఆశ్చర్యపడుతుంటారు. నేను చెబుతుంటాను, "అయ్యా! నేను అపవిత్రమైన ఆహారాన్ని భుజించడం లేదు. కలుషితమైన గాలిని పీల్చడం లేదు. భక్తులయొక్క ప్రార్థనలనే గాలిని నేను తీసుకుంటున్నాను. ఇటువంటి పరిస్థితిలో నా తేజస్సు ఎక్కడికి పోతుంది!" నాకెట్టి జబ్బు లేదు. నాకెట్టి నొప్పి లేదు. ఒక పిల్లవాడు చేసిన పొరపాటువల్ల నేను క్రిందపడ్డాను. అప్పుడు నా కాలు విరిగింది. అందువల్ల, నడవడానికి కొంత ఇబ్బందిగా ఉన్నది. అయితే నాకు నడవాలని ఇష్టముకూడా లేదు. ఎట్లాగైతేనేమి, వస్తున్నాను, భక్తులను చూస్తున్నాను. ఇందులో కష్టమేమున్నది! బాధ ఏమున్నది! ఎట్టి బాధా నాకు లేదు. భక్తులను ఆనందపరచినప్పుడు నాకుకూడా ఎంతగానో ఆనందము కలుగుతుంది. బాధ, నొప్పి, కష్టము అనేవి నాకు స్వప్నమునందైనా రావు. నాకెప్పుడూ ఆనందమే! ఆనందమే నా యొక్క ఆహారము. నాయొక్క ఆనందముకంటే మించినటువంటి ఆనందము ఎక్కడా లేదు. ఏ కారణంచేతనైనా ఒక దినము నేను సభకు రాకపోతే, 'అయ్యో పాపం, భక్తులు ఎంత బాధపడుతుంటారో! ఎంత వెయిట్ చేస్తుంటారో! ఎంత విచారిస్తుంటారో!' అని చాలా బాధపడుతుంటాను. ఎంత టైమ్ అయినా సరే, నేను బయల్దేరి వస్తుంటాను. కాబట్టి, నాకు బాధ అనిగాని, నొప్పి అనిగాని మీరు భావించకండి. ఇట్టి సత్యమైన ఆనందాన్ని మీకు చూపించే నిమిత్తమై నేనీనాడు ఈవిషయాలు మీకు చెబుతున్నాను.

మీరుకూడను ఎలాంటి కష్టములు వచ్చినప్పటికీ, ఎలాంటి బాధలు సంభవించినప్పటికినీ దైవంపైన భక్తి, విశ్వాసములు పెట్టుకొని ధైర్యంగా వాటిని ఎదుర్కొని సాధిస్తూ రావాలి. దైవచింతన చేస్తూ వుంటే ఏ చింతలుకూడా మనలో ప్రవేశించవు. ఏ కష్టముగాని, నష్టముగాని, దుఃఖముగాని, విచారముగాని ప్రవేశించుటకు వీలుకాదు. నేను ఎప్పుడూ ఆనందంగానే ఉంటాను. మీరు కూడా ఎప్పుడూ ఆనందంగానే ఉండాలి. 'హేపీనెస్ ఈజ్ యూనియన్ విత్ గాడ్'. దైవంతో కూడినప్పుడు ఏ బాధలూ మీకు కనిపించవు. దేహరీతిగా ఉండవచ్చును కొన్ని బాధలు; మానసికంగా ఉండవచ్చును కొన్ని చింతలు. ఈ మనస్సును, ఈ దేహమును పవిత్రమైన ఆత్మతత్త్వముతో చేర్చకుండా చూచుకోవాలి. అప్పుడు మీకు ఎట్టి బాధలుకూడను సంభవించవు. ఇదే నవరాత్రులు అందించే సత్యమైన బోధ. ప్రతి దినం ఎన్నియో బాధలు సంభవిస్తుంటాయి, ఎన్నియో చింతలు కలుగుతుంటాయి, ఎన్నియో విషయాలు మన మనస్సును చేరుతుంటాయి. 'ఇవన్నీ ఎవరివోగాని నావి కావు' అనే భావనతో వాటిని లక్ష్యపెట్టకూడదు. గాలికి వచ్చినవి గాలిలోనే పోతాయి. నేనెప్పుడుకూడను ఇలాంటివాటికి అవకాశమివ్వను.

"కర్మమె నరునకు దైవము. కర్మమె సుఖదుఃఖములకు కారణమిలలో." కనుక, ఎవరో మనలను బాధలకు గురి చేస్తున్నారని మనము భావించరాదు. ఎవరివల్లనో మనకు బాధలు సంభవిస్తున్నాయని వారిని నిందించరాదు. మన కష్టనష్టములు మరొకరివల్ల సంభవించినవి కావు. పాండవులను బాధించడానికి కౌరవులు ఎంతగానో ప్రయత్నించారు. కాని, పాండవులు వారికి ఏమాత్రము లొంగలేదు. కారణమేమిటి? కృష్ణునిపట్ల వారికి గల అచంచల భక్తి, విశ్వాసములే! 'కృష్ణుడే మాకు తోడునీడగా ఉన్నప్పుడు ఎవరెన్ని బాధలు పెట్టినా మాకు భయమెందుకు!' అని భావించారు. అదేవిధముగా, మీరుకూడను సాయి మీ ఇంట, వెంట, జంట ఉన్నాడని

విశ్వసించండి. ఈ బాధలు, ఈ కష్టములు, ఈ విచారములతో సంబంధము పెట్టుకోకండి. ఆకాశంలో ఎన్నో మేఘాలు వస్తుంటాయి, పోతుంటాయి. ఏదీ శాశ్వతంగా సూర్యునికి అడ్డు నిలువలేదు. వర్షాకాలంలోనే మేఘాలు సూర్యునికి అడ్డం వస్తుంటాయి. అదేవిధంగా, మన మనస్సు చంచలంగా ఉండినప్పుడే మనకీ బాధలన్నీ సంభవిస్తుంటాయి. మన మనస్సు స్థిరంగా, దృఢంగా ఉన్నప్పుడు 'మేఘాలు' అడ్డురావడానికి వీలేలేదు. కనుక, మీరు మీ మనస్సును నిర్మలంగా, నిశ్చలంగా ఉంచుకోండి. ధైర్య సాహసాలను పోషించుకోండి.

ఈనాడు మానవ జీవితము ఏవిధంగా ఉన్నది? ఈ జగత్తనే నాటకరంగములో చేరి కామక్రోధములనే పాటలు పాడుకుంటూ, మద, అహంకారములతోకూడిన ఆటలు ఆడుకుంటూ జీవిత నాటకాన్ని సాగిస్తున్నారు. దీనిని చూసి చాలామంది, 'చాలా బాగుంది' అని మురిసిపోతున్నారు. కాని, కొందరు మాత్రం దీనిని విశ్వసించక, ఈ 'యాక్షన్'ను చూసి భ్రమించక, దీనినుండి వచ్చే 'రియాక్షన్, రిఫ్లెక్షన్, రీసౌండ్'లకు భయపడక, కేవలం 'రియాలిటీ'పై తమ దృష్టి నిలుపుకుటున్నారు. ఆ 'రియాలిటీ'యే దైవత్వము. అది చలించదు, భ్రమించదు, కంటికి కనిపించదు. అట్టి 'రియాలిటీ'ని మనము గట్టిగా పట్టుకోవాలి. 'రియాలిటీ'ని ఆధారం చేసుకున్నప్పుడు మన తలంపులు, మన ప్రవర్తన, మన పలుకులు (రియాక్షన్, రిఫ్లెక్షన్, రీసౌండ్) ఈ మూడూ పవిత్రంగానే ఉంటాయి. కనుక, విద్యార్థులారా! 'కదలిపోయే మేఘాల'ను చూసి మీరేమాత్రము భయపడకూడదు. ఏమాత్రము చింతించకూడదు. మీ కర్తవ్యాన్ని మీరు చక్కగా నిర్వర్తించండి. మీ తల్లిదండ్రులను మీనుండి ఏమి ఆశిస్తున్నారో దానిని నెరవేర్చండి. తల్లిదండ్రులు కొండంత ఆశపెట్టుకొని మిమ్మల్ని ఇక్కడికి పంపించారు. వారి అభీష్టాలకు విరుద్ధంగా మీరు ప్రవర్తిస్తే వారు ఎంత బాధపడతారో యోచించండి. మీరు మీ తల్లిదండ్రులను కష్టపెడితే స్వామిని కూడా కష్టపెట్టినవారవుతారు.

"త్వమేవ మాతాచ పితా త్వమేవ త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ త్వమేవ సర్వం మమ దేవ దేవ"

అని మీరు ప్రార్థిస్తున్నారు కదా! దేవునికి, తల్లిదండ్రులకి భేదము లేదు. కనుక, తల్లిదండ్రులను ఆనందపెట్టండి. స్వామి ఎప్పుడూ ఆనందంగానే ఉంటాడు. ఈ సత్యాన్ని మీ హృదయంలో భద్రం చేసుకోండి. ఆవిధంగా ఉన్నప్పుడే మీరు నిజంగా విద్యార్థులనిపించుకుంటారు.

'విద్య' అనగా లౌకికమైన చదువు అని మీరు భావిస్తున్నారు. కాదు, కాదు. విద్య అనేది హృదయానికి సంబంధించినది. హృదయమునుండి వచ్చే విద్య ఎప్పటికీ చలించేటటువంటిది కాదు, మరుగునపడేటటువంటిది కాదు. ఆత్మవిద్యయే నిజమైన విద్య. ఒకానొక సమయంలో ప్రహ్లాదుణ్ణి తండ్రి హిరణ్యకశిపుడు దగ్గరకు పిలిచి, "నాయనా! నిన్ను గురువులదగ్గర చేర్పించాను. నీకు చక్కని బోధలు చేయమని చెప్పాను. వారు నీకు ఏమి బోధిస్తున్నారు?" అని అడిగాడు. అప్పుడు ప్రహ్లాదుడు చెప్పాడు –

"చదివించిరి నను గురువులు
చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబులు నే
చదివినవి కలవు పెక్కులు
చదువులలోన మర్మమెల్ల చదివితి తండ్రీ!"

హిరణ్యకశిపుడు ఎంతో ఆనందించి, "ఏదీ, ఆ మర్మమేమిటో చెప్పు నాయనా!" అన్నాడు. ప్రహ్లాదుడు, "తండ్రీ! మనము చూసేది, అనుభవించేది అంతా అనిత్యము, అశాశ్వతము. దైవమే సత్యము", అన్నాడు. తండ్రికి కోపం వచ్చింది. ప్రహ్లాదుణ్ణి మెడపట్టి క్రిందికి నెట్టాడు. "తండ్రి ఆజ్ఞను ధిక్కరించినవాడు నా కనులముందు ఉండటానికి

వీల్లేదు. తక్షణమే వీనిని తీసుకువెళ్లి సముద్రంలో పడేయండి", అని ఆదేశించాడు. రాక్షసులు ప్రహ్లాదుణ్ణి తీసుకువెళ్ళి కొండపైనుండి సముద్రంలోకి నెట్టారు. అప్పుడుకూడను ప్రహ్లాదుడు, "నారాయణ, నారాయణ' అని స్మరిస్తూనే ఉన్నాడు. శ్రీమన్నారాయణుడు సముద్రంలోనుంచి బయటికి వచ్చి ప్రహ్లాదుణ్ణి పట్టుకుని కాపాడినాడు. 'వీడింకా చావలేదా' అని హిరణ్యకశిపుడు కోపోద్రిక్తుడై అతనిని అగ్నిగుండంలో పడద్రోయించాడు. తక్షణమే ఆ అగ్నికూడా ఆరిపోయింది. అతనిని దహించడానికి అగ్నికూడా ఇష్టపడలేదు. దీని అంతరార్థమేమిటి? మంచికి చెడు అడ్డు తగులుతూనే ఉంటుంది. కాని, చెడు సంభవించినప్పటికీ అది మంచివారిని బాధించదు. కాచిన చెట్టుకే రాళ్ల దెబ్బలు పడుతుంటాయి. అదేవిధముగా మంచివారికి ఇలాంటి కష్టములు ఎదురవుతుంటాయి. ఎన్ని వచ్చినప్పటికీ వాటిని భగవద్విశ్వాసముతో ఎదుర్కోవాలి.

విద్యార్థులారా! తల్లిదండ్రుల ఆజ్ఞను, దైవముయొక్క ఆజ్ఞను మీరు తు.చ. తప్పకుండా అనుసరించండి. సత్ప్రవర్తనను అలవర్చుకోండి. అంతా మీకు మంచే జరుగుతుంది. ఏదీ మిమ్మల్ని బాధించదు. ఏదీ మిమ్మల్ని కష్టపెట్టదు. ఇలాంటి సత్యవాక్యములను ఆచరణలో పెట్టే నిమిత్తమై ఈ దసరా ఉత్సవాలలో దుర్గ, లక్ష్మి, సరస్వతి ముగ్గురినీ ఆరాధిస్తున్నారు. దుర్గ అనగా భయంకర స్వరూపిణి కాదు; మిమ్మల్ని రక్షించేటటువంటి మహాదేవత. లక్ష్మి సకలైశ్వర్య స్వరూపిణి. ఇక, సరస్వతి వాగ్దేవత. మంచి తలంపులు, మంచి వాక్కులు, మంచి ప్రవర్తన ఈ మూడూ లక్ష్మి, సరస్వతి, దుర్గయొక్క తత్త్వములను ప్రకటిస్తున్నాయి. మీకు ఎవరు మంచిని బోధిస్తారో వాళ్లే సరస్వతీ స్వరూపులు. ఎవరు మీకు చెడును బోధిస్తారో వాళ్లే అసురులు. అట్టి రాక్షసులనే దుర్గాదేవి సంహారం చేసింది. దుర్గ, లక్ష్మి, సరస్వతి – ఈ ముగ్గురు వేరుగా లేరు; మీ హృదయంలోనే ఉన్నారు. మనిషికి మనిషిగా జీవించమని బోధిస్తున్నారు. దుర్గ, లక్ష్మి, సరస్వతి ముగ్గురూ మానవునికి ముగ్గురు మాతలు.

ఈవిధమైన మంచి విషయాలను మీ హృదయంలో చేర్చుకొని, ఆచరణలో పెట్టి, అభివృద్ధికి వచ్చి, మంచి ఆదర్శాన్ని నిరూపించాలి. భారతీయ విద్య చాలా గొప్పది అనే సత్యాన్ని మీరు ప్రపంచానికంతటికీ చాటాలి. ఈ ఆధునిక ప్రపంచంలో అనేకమంది దుర్విద్యలను బోధిస్తున్నారు. వాటిని మీరు త్యజించాలేగాని, వరించకూడదు. 'ఇది నా హృదయానికి మంచిదా, కాదా?' అని విచారణ చేయాలి. మీ హృదయానికి నచ్చకపోయినప్పుడు దానిని ప్రక్కకు నెట్టేయండి. హృదయానికి సంతృప్తికరంగా నడుచుకున్నప్పుడే మీ జీవితం సుఖశాంతులతో వర్ధిల్లుతుంది. నిరంతరము నామస్మరణ చేయండి.

(హరిభజన బినా సుఖ శాంతి నహీ....)

(2006 సెప్టెంబరు 28వ తేదీ దసరా సందర్భముగా సాయికుల్వంత్‌లో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)